అధ్వానంగా రోడ్లు

- చింతలపాలెంలో గుంతలమయంగా ప్రధాన రహదారులు
- మేళ్లచెరువు రోడ్డులో డ్రెయినేజీ లేక రోడ్డుపై నిలుస్తున్న వర్షపునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


చింతలపాలెంలో మేళ్లచెరువు వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై గుంతలు పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చింతలపాలెం నుంచి మేళ్లచెరువు వెళ్లే రహదారి, గుడిమల్కాపురం వెళ్లే మెయిన్ రోడ్డు గుంతలమయంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో గుంతలు మరింత లోతుగా మారాయి. దీంతో వర్షపు నీరు గుంతల్లో నిలిచి వాహనాలు రాకపోకలకు మురుగునీరు చింది మీద పడుతోందని పాదాచారులు వాపోతున్నారు. ఈ రోడ్లపై నడిచి వెళ్లే చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రం శివారులోని సిమెంట్ పరిశ్రమకు చెందిన వాహనాలు ఈ రోడ్డు మీదుగా నిత్యం సున్నపు రాయి లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నా వారు కూడా పట్టించుకోకోవడం విడ్డూరంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డుపైనే వర్షపు నీరు..

మండల కేంద్రంలోని మేళ్లచెరువు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు పోయేందుకు దారిలేక నీరంతా రోడ్డుపై నిలుస్తోంది. చింతలపాలెం చౌరస్తా నుంచి చింత్రియ్యాల, గుడిమల్కాపురం వైపు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు సరైన ప్రణాళిక లేకుండా నిర్మించడంతో పాటు దుకాణదారులు కాలువలపై మూతలు వేయడంతో వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. దీంతో వాహనాల రాకపోకలతో బీటీ రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడుతున్నాయి. కనీసం ఈ గుంతలు పూడ్చి మరమ్మతులు చేసేందుకు పరిశ్రమల వారు కూడా ముందుకు రావడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలి



మేళ్లచెరువు, గుడిమల్కాపురం మెయిన్ రోడ్లపై వర్షపు నీరు నిలిచి గుంతలు పడుతున్నాయి. ఈ రోడ్ల వెంట డ్రెయినేజీ లేకపోవడంతోనే నీరు రోడ్డుపై నిలుస్తోంది. రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించాలి.

– మోర్తాల నాగిరెడ్డి, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, చింతలపాలెం

అధికారులు స్పందించాలి



మెయిన్ రోడ్డుపై గుంతలలో వర్షపు నీరు నిలిచి వారం రోజుల వరకు ఉంటోంది. వాహనాలు వేగంగా వచ్చివెళ్తున్న సమయంలో నీరు చిమ్మి మా దుకాణంపై, ఖాతాదారులపై పడుతోంది. దీంతో మా వ్యాపారానికి ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌కే హమీద్, దుకాణదారుడు, చింతలపాలెం

క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్ పర్యటన 17కు వాయిదా

హుజూర్‌నగర్ : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో శుక్రవారం జరగాల్సిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు మంత్రి పీఆర్‌ఓ వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి జూలై 17న మంత్రి ఉత్తమ్ పర్యటన ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు


రాంచందర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కోదాడరూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నారపరాజు రాంచందర్‌రావును శుక్రవారం హైదరాబాద్‌లో ఆ పార్టీ కోదాడ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోదాడకు చెందిన నాయకుడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే తన స్వగ్రామమైన నల్లబండగూడెం వస్తానని రాంచందర్‌రావు తెలిపారని వారు చెప్పారు. కార్యక్రమంలో కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా కోటయ్య


కోటయ్య

అనంతగిరి : రేషన్ డీలర్ల సంఘం అనంతగిరి మండల అధ్యక్షుడిగా పి.కోటయ్య, కార్యదర్శిగా కుక్కల శ్రీను ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన రేషన్ డీలర్ల మండల కమిటీ సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కోటయ్య మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సంఘం అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సంగబోయిన అంతయ్య, శ్రీను, జి.వెంకటేశ్వర్లు, మట్టపల్లి రామ్మూర్తి, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

యూరియా, ఎరువుల కొరత లేదు

మునగాల : మండలంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌కు అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు, యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎటువంటి కొరత లేదని మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆకుపాముల, కొక్కిరేణి, తాడువాయి సహకార సంఘాల్లోతో పాటు పలు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లోని ఎరువులు, యూరియా నిల్వలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా నాలుగు సొసైటీలు, ఎరువుల దుకాణాల్లో 7,097 బస్తాల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం నారుమడులకు ఈ నిల్వలు సరిపోతాయని అన్నారు. సొసైటీల సిబ్బంది, ప్రైవేటు ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

మత్స్య రైతుల దినోత్సవం


మత్స్య రైతులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో శుక్రవారం మత్స్య రైతుల దినోత్సవాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య రైతులు కొణతం సైదిరెడ్డి, బల్లె బాబ్జి, నేరేడుచర్ల మత్స్య సొసైటీ యామిని వీరయ్యను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి, క్లబ్ జిల్లా చైర్మన్ బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, క్లబ్ ప్రధాన కార్యదర్శి యూసుఫ్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, సభ్యులు నాగార్జున, చిలకరాజు శ్రీను తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


బస్‌పాస్‌ల పంపిణీని ప్రారంభిస్తున్న ఏడీఎం నాగశ్రీ, ఆకుల రాము

హుజూర్‌నగర్ : ఆర్టీసీ అమలు చేస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ నాగశ్రీ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని పాత బస్టాండ్‌లో దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం పట్టణ గౌరవ సలహాదారులు ఆకుల రాముతో కలిసి అర్హులైన దివ్యాంగులకు బస్ పాస్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కోదాడ ఆర్టీసీ బస్ డిపో నుంచి ప్రత్యేక ప్యాకేజీ టూర్ పేరుతో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కోదాడ నుంచి ఏపీలోని దాచేపల్లికి వయా హుజూర్‌నగర్, మట్టపల్లి మీదుగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వీరాంజనేయులు, శ్రీను, రామకృష్ణ, ఆర్టీసీ సిబ్బంది అబ్దుల్, మధు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'వందరోజుల ప్రణాళిక'


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేరేడుచర్ల : వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో తడి, పొడి చెత్తపై చేపట్టిన అవగాహన ర్యాలీ 39వ రోజుకు చేరింది. శుక్రవారం 9వ వార్డులోని కోఆపరేటీవ్ బ్యాంకు ప్రాంతంలో మున్సిపల్ అధికారులు డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య సిబ్బంది కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు వార్డుల్లో పేదల వివరాలు సేకరించాలని ఆదేశించారు. అదేవిధంగా పట్టణ పరిధిలో దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

శాకంబరీ అలంకరణలో తిరుపతమ్మ


శాకంబరీ అలంకరణలో పూజలందుకుంటున్న లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి

మఠంపల్లి : ఆషాఢమాసం పురస్కరించుకొని మఠంపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. తిరుపతమ్మను భక్తులు కూరగాయలు, ఫలాలతో శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జిల్లాబోయిన దశరథ రామయ్య, ఆలయ పూజారి కంటు వీరయ్య, రామనరసమ్మ, గోపి, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులను నిష్ణాతులు చేయడమే లక్ష్యం


నేరేడుచర్ల : విద్యార్థులకు చేతిరాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎం

నేరేడుచర్ల : చదవడం, రాయడంలో విద్యార్థులకు నిష్ణాతులను చేయడమే లక్ష్యమని నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల విద్యాధికారులు పుట్లూరి సత్యనారాయణరెడ్డి, చత్రునాయక్ అన్నారు. విద్యార్థులకు రాయడం, చదవడంలో సామర్థ్యాలు కలిగి ఉండాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో గల కాంప్లెక్స్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం పలువురు ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. తదనంతరం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ చేతిరాత పుస్తకాలు పంపిణీ చేశారు. మండల రిసోర్స్ పర్సన్లు ఆర్.శ్రీనయ్య, శ్రీధర్, కృష్ణారెడ్డి, కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నూతన అడ్మిషన్లలో రావిపహాడ్ స్కూల్ టాప్

మోతె : మండలంలోని రావిపహాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2025– 26 విద్యా సంవత్సరంలో నూతన అడ్మిషన్ల పెంపులో మండల స్థాయిలో ప్రథమ స్థానం, తుమ్మలపల్లి ప్రాథమిక పాఠశాల రెండవ స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ కె.గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రావిపహాడ్ ప్రాథమిక పాఠశాలలో 34, తుమ్మలపల్లిలో 28 నూతన అడ్మిషన్లు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేకధికారి శ్రవణ్.. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను అభినందించారు. రావిపహాడ్ పాఠశాల హెచ్‌ఎం నాయకపు పరమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘం సభ్యుల ఎడ్యుకేషనల్ టూర్


ఎడ్యుకేషన్ టూర్‌లో ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సిబ్బంది

కోదాడరూరల్ : రాష్ట్రంలో ఆదర్శ సహకార సంఘాల్లో ప్రథమ స్థానంలో ఉన్న హనుమకొండ జిల్లాలోని ముల్కనూరు సహకార సంఘం కార్యాలయాన్ని ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా శుక్రవారం కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది సందర్శించారు. రైతులు పండించిన ధాన్యాన్ని అక్కడి సంఘం సేకరించి మేలైన వంగడాలను తయారు చేసేందుకు శాస్త్రవేత్తలను నియమించుకున్న తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. సంఘం అందజేసే పలు రకాల రుణాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

గోరింటాకు సంబరాలు


గోరింటాకు నూరుతున్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆషాఢ గోరింటాకు సంబరాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు పూజలు చేశారు. అనంతరం మహిళలు గోరింటాకు నూరి ఒకరికొకరు గోరింటాకు వాయనం ఇచ్చిపుచ్చుకున్నారు. మహిళలంతా గోరింటాకు పెట్టుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా విభాగం నాయకురాళ్లు గరిణె ఉమా మహేశ్వరి, ఓరుగంటి విజయలక్ష్మి, ఆలేటి వెంకటలక్ష్మి, కొండూరి మాధవి, తోట కమల, అట్లూరి మంజుల, వంకాయల పద్మవతి, ఓరుగంటి రాజ్యలక్ష్మి, పేరూరి జ్యోతి, శ్యామల, అనురాధ, మంగమ్మ, ఇందిర, శోభ, మణి, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కళాజాత


చిలుకూరు : మహిళలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

చిలుకూరు : ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని బేతవోలు గ్రామంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అందించే వడ్డీలేని రుణాలు, మహిళా సంఘాల్లో పొందే లాభాలు, బీమాతో లోన్లు, ప్రమాద బీమా, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఉచిత బస్సు సౌకర్యం, మహిళా సంఘాల నుంచి గోదాములు, క్యాంటీన్లు, శ్రీనిధి ద్వారా డెయిరీ యూనిట్లు, నాటు కోళ్ల యూనిట్లు, తదితర పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, సీసీలు స్వరూప, వీఓఏలు, సమభావన సంఘం మహిళలు, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం సెంటర్‌లో శుక్రవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా వడ్డీ లేని రుణాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ఆట, పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిసింగ్, ఏపీఎం రామలక్ష్మి, సీసీ సాంబయ్య, జ్యోతి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో పారిశుద్ధ్య చర్యలు

నడిగూడెం : మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పాఠశాల పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి ఎండి.అన్వర్, ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, వార్డెన్ దేవరమ్మ, హాస్టల్ ఏఎన్‌ఎం మనీ, ఆశా కార్యకర్త రమణ కుమారి పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్.. చారిత్రాత్మక నిర్ణయం


మునగాలలో సీఎం, మంత్రి, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మునగాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని పలువురు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గణపవరం క్రాస్‌రోడ్డులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఫ్లెక్సీకి వారు పాలాభిషేకం నిర్వహించి బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాసర్ల కోటేశ్వరరావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, మండల నాయకులు కాసర్ల శ్రీను, ఎలియాస్ బోస్, ఉప్పుల జానకిరెడ్డి, అమరబోయిన మట్టయ్య, చింతకాయల నాగరాజు, వేనేపల్లి వీరబాబు, చక్కా కిశోర్, నలమాద మల్సూర్, గంధం సైదులు, పనస శంకర్, గన్నా నరసింహారావు, రామిరెడ్డి, చిర్రా శ్రీనివాస్, గౌస్, శెట్టిగిరి, చేగొండి శ్రీను, గుండు నగేష్, మండవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు బీసీ నాయకులు అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల తీర్మాణంపై హర్షిస్తూ శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి మాట్లాడారు. రాహుల్ గాంధీ కామారెడ్డిలో చేసిన డిక్లరేషన్, జోడో యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మాటనిలుపుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు భాషబోయిన భాస్కర్‌రావు, కాసాని శివకృష్ణ, ఈదుల కృష్ణయ్య, కందుల కోటేశ్వరరావు, రామినేని శ్రీనివాసరావు, అచ్చయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చంద్రం, తదితరులు ఉన్నారు.

మంత్రివర్గ నిర్ణయంపై హర్షం

నడిగూడెం : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల మాజీ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42 శాతం వాటా కేటాయించనున్నట్లు తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికలలో బీసీలందరూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సహకరించాలని తెలిపారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం


పాఠశాలకు టేబుళ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అభినందనీయమని ఎంఈఓ ఛత్రు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి ప్రధాని సునీల్ జ్ఞాపకార్థం 2017– 18 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ. 15 వేలు విలువ గల ఆరు టేబుళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాని అమరయ్య, సునిత, సైదులు, గోపి, శ్రీను, స్నేహితులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మట్టి పోశారు


సీసీరోడ్డు మార్జిన్‌లో పోసిన మట్టి

సాక్షి ఎఫెక్ట్..

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం వెళ్లే రహదారిలో ఇటీవల రూ.10 కోట్ల వ్యయంతో సుమారు 800 మీటర్ల పొడువు, 7 మీటర్ల వెడల్పుతో సీసీరోడ్డు నిర్మించారు. కానీ రోడ్డుకు ఇరువైపుల కాంట్రాక్టర్ మట్టిపోయకుండా వదలివేశారు. దీంతో సాక్షి పత్రికలో గత నెలలో పలు మార్లు 'సీసీ వేశారు... మార్జిన్ మరిచారు'అనే శీర్షికతో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ ఏఈ బి.సత్యనారాయణ స్పందించారు. కాంట్రాక్టర్‌పై వత్తిడి తీసుకువచ్చి శుక్రవారం మార్జిన్‌పై మట్టి పోయడాన్ని ప్రారంభించారు. తమ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషిచేసిన సాక్షి దినపత్రిక యాజమాన్యానికి గ్రామప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బూరుగడ్డ ఆలయంలో గోపూజ

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో వేంచేసి ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీ నరసింహవేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో శుక్రవారం ఘనంగా గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ గావించారు. కార్యక్రమంలో భక్తులు భాస్కర్, వీణా, నరేందర్ రెడ్డి, వాసంతి, రంగరామానుజన్, నీరజావల్లి, ఉపేందర్, మమత, ఆలయ ధర్మకర్తలు, ఈఓ, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణతోనే జనాభా నియంత్రణ


హుజూర్‌నగర్ : లింగగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ వేణుగోపాల్, సిబ్బంది

హుజూర్‌నగర్ : కుటుంబ నియంత్రణతోనే జనాభా నియంత్రణ సాధ్యమని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక జనాభా అనర్థాలకు మూలమన్నారు. జనాభా వృద్ధితో ఆర్థిక అసమానతలు ఏర్పడటమే కాకుండా నిరుద్యోగం పెరిగి ఆహార కొరత ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఈహెచ్‌ఓ పద్మ, పీహెచ్‌ఎన్‌లు నూర్జహాన్ బేగం, రత్నమేరీ, సూపర్‌వైజర్‌లు పద్మ, రామకృష్ణ, శ్రీనివాస్, ఎల్‌టీ రమేష్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన పెంచుకోవాలి

నడిగూడెం : జనాభా నియంత్రణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని త్రిపురవరంలో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కేజీయా, వెంకటనర్సమ్మ, గంగ, మహేష్, ఇందిరా, సుజాత, విజయ, మంజుల, మంగ, పద్మావతి, రాధ, రమాదేవి పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సదస్సును జయప్రదం చేయాలి


మోతెలో మాట్లాడుతున్న గిద్దె రాజేష్

మోతె : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 14న జరిగే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని భారత వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. శనివారం మోతె మండల కేంద్రంలో జరిగిన చేయూత పెన్షన్‌దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వృద్ధులు, వితంతులు, వికలాంగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు, రూ.6 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి 18 నెలల క్రితం గద్దె నెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి నేటికీ పెన్షన్లు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత్ వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం కాశీం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరు ఈదయ్య బాబు, సుధాకర్, నర్సయ్య, డి.కార్తీక్, బొల్లాకొండ వెంకన్న, తురక నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మునగాల : జిల్లా కేంద్రంలో ఈ నెల 14న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి చేయూత పింఛన్‌దారుల సమావేశానికి చేయూత పింఛన్‌దారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరేల్లి బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వెంకట్రాంపురంలో నిర్వహించిన చేయూత పింఛన్‌దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ నాయకులు మంద ముత్తయ్య, దొంగరి వెంకటేశ్వర్లు, చెవుల శ్రీను, నాగేంద్ర, రాణమ్మ, ఉపేంద్ర, దొంగరి సత్యనారాయణ, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక


విద్యార్థి ఎత్తు కొలుస్తున్న ఎన్‌సీసీ అధికారులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని రామాపురంలో గల ఎంజేపీటీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లను ఎన్‌సీసీ బెటాలియన్ 31(టీ) నల్లగొండ అధికారులు శుక్రవారం ఎంపిక చేశారు. 8వ తరగతి విద్యార్థులకు దేహదారుఢ్య, వైద్య, రాత పరీక్షలు నిర్వహించి క్యాడెట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యత అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, సీటీఓ గోపాలరావు, ఏటీపీ నాగరాజు, డిప్యూటీ వార్డెన్ సోమయ్య తదితరులు ఉన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని ఇళ్ల సాధన కమిటీ అధ్యక్షుడు వై.సోమయ్య అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ పేదల సొంతింటి నెరవేర్చాలనే ఒక గొప్ప సంకల్పంతో మంత్రి ఉత్తమ్ రామస్వామి గుట్ట వద్ద 2160 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.